

అండగా అమ్మ ఒడి

- పేద విద్యార్థుల చదువుకు ప్రభుత్వ ప్రోత్సాహం
- ఏటా రూ.15 వేల ఆర్థిక సాయం
- 'ఉత్తర'లో వేలాది మందికి లబ్ధి


మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

సీతంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అమ్మ ఒడి పథకం పేద, మధ్య తరగతి కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. పిల్లల చదువు తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకూడదనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని అమలులోకి తెచ్చారు. ఇంట్లో ఇద్దరు పిల్లలను బాగా చదివించాలంటే పుస్తకాలు, ఫీజుల ఖర్చు గురించి తల్లిదండ్రులు ఆలోచించాల్సిన పరిస్థితి ఉండేది. పిల్లల చదువు వారిపై ఏ విధంగా భారమవుతుందో ప్రజాసంకల్ప యాత్రలో విన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేనున్నానంటూ అధికారంలోకి రాగానే అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టారు.

1వ తరగతి నుంచి ఇంటర్ వరకు..

పిల్లలను బడికి పంపే తల్లికి ప్రతి ఏటా రూ.15 వేల ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 2020 జనవరి 9న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పథకాన్ని ప్రారంభించారు. తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి, ప్రభుత్వ లేదా ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివించే పిల్లలకు ఈ పథకాన్ని వర్తింపజేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వరుసగా నాలుగేళ్లు ఈ పథకాన్ని అమలు చేసి పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని పిల్లల చదువుకు అండగా నిలిచారు.

నియోజకవర్గంలో నాలుగేళ్లుగా..

ఉత్తర నియోజకవర్గంలోని 17 వార్డుల్లో గల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న వేలాది మంది విద్యార్థులు నాలుగేళ్లుగా అమ్మ ఒడి పథకం కింద ఆర్థిక సాయం అందుకుంటున్నారు. 2019–20లో 29,508 మంది, 2020–21లో 31,311 మంది, 2021–22లో 27,203 మంది, 2022–23లో 27,322 మంది విద్యార్థులకు ఈ పథకం కింద వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.35.51 కోట్లు ఆర్థిక సాయం జమైంది.

నాలుగు సార్లు వచ్చింది



మా బాబు బషీర్, పాప సుహాన ముస్లిం తాటిచెట్లపాలెం జీవీఎంసీ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్నారు. రెండేళ్లు బాబు పేరున, రెండేళ్లు పాప పేరున అమ్మ ఒడి నగదు సాయం అందింది. ఇంగ్లిష్ మీడియం బోధన, పుస్తకాలు, బ్యాగు, షూ, యూనిఫారం ఉచితంగా ఇచ్చారు. రుచికరమైన భోజనం, రాగిజావ ఇస్తున్నారు. పిల్లలకు మేనమామలా అన్నీ తానై చూస్తున్న జగనన్నకు రుణపడి ఉంటాను.

– ఫరియా బేగం, ఎంటీసీ పాలెం

రూపాయి ఖర్చు లేకుండా..



నాకు ముగ్గురు పిల్లలు. ఈ రోజుల్లో ముగ్గురినీ చదివించాలంటే వేలల్లో ఖర్చవుతుంది. జగనన్న పుణ్యమా అని ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా పిల్లలను ఇంగ్లిష్ మీడియం చదివిస్తున్నాను. కార్పొరేట్ స్థాయిలో క్లాస్‌రూమ్స్, టాయిలెట్లు, డిజిటల్ క్లాసులు, ట్యాబ్స్ ఇలా ఎన్నో సదుపాయాలు కల్పించారు. పైగా ప్రతి ఏటా అమ్మ ఒడి కింద డబ్బులు జమ చేస్తున్నారు. వరుసగా నాలుగేళ్లు అమ్మ ఒడి అందుకున్నాను.

– పి.అనిత, విద్యార్థి తల్లి, సీతంపేట

వార్డుల వారీగా 'అమ్మ ఒడి' లబ్ధిదారుల వివరాలు

వార్డు నం.	లబ్ధిదారులు	లబ్ధి
14	2,250	రూ.2.92 కోట్లు
24	2,456	రూ.3.19 కోట్లు
25	2,356	రూ.3.06 కోట్లు
26	2,560	రూ.3.32 కోట్లు
42	138	రూ.17.94 లక్షలు
43	331	రూ.43.03 లక్షలు
44	485	రూ.63.05 లక్షలు
45	1,122	రూ.1.45 కోట్లు
46	893	రూ.1.16 కోట్లు
47	1,302	రూ.1.69 కోట్లు
48	1,129	రూ.1.46 కోట్లు
49	9,111	రూ.11.84 కోట్లు
50	718	రూ.93.34 లక్షలు
51	701	రూ.91.13 లక్షలు
53	532	రూ.69.16 లక్షలు
54	612	రూ.79.56 లక్షలు
55	626	రూ.81.38 లక్షలు

అభివృద్ధే ధ్యేయంగా జగనన్న పాలన

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- రూ.2.75 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


46వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 46వ వార్డులో రూ.2.75 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సోమవారం కై లాసపురంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా ఆయన శంకుస్థాపన చేసి శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం శాంతినగర్‌లో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పనిచేస్తున్నారన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు పనులను జరుగుతున్న సమయాల్లో కచ్చితంగా పర్యవేక్షించాలన్నారు. డిప్యూటీ మేయర్ సతీష్ మాట్లాడు తూ రూ.2.75 కోట్ల నిధులతో తాటిచెట్లపాలెం జాతీయ రహదారి నుంచి కై లాసపురం బస్టాప్ వరకు బీటీ రోడ్లు, డ్రైనేజీలు, కాలువలు, ఫుట్‌పాత్‌లు నిర్మించనున్నట్లు తెలిపారు. కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, ఈఈ మత్స్యరాజు, డీఈ భరణికుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ జాగారాపు నరేష్, నాయకులు గోవింద్, చిన్నా, రామారావు, కృష్ణ, నర్సింగరావు, దుర్గాభవాని, లావణ్య, దేవి, కృపా, బొట్టా రాజు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ


లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో సోమవారం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు సూచనల మేరకు వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ రూ.25 లక్షలకు పరిమితిని పెంచిన కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. 286, 287, 288, 289, 290, 291 సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు, రూ.5 లక్షల విలువ గల ఆయుష్మాన్ భారత్ కార్డులు, కళ్లదాళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీలు, అంబేడ్కర్ కాలనీ యూపీహెచ్‌సీ డాక్టర్ వెంకటేష్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన


శ్మశానవాటికను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బర్కత్ అలీ

మద్దిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు శివనగర్‌లోని హిందూ శ్మశానవాటికలో పలు పనులను సోమవారం కార్పొరేటర్ బర్కత్ అలీ పరిశీలించారు. ముందుగా శ్మశానవాటిక రక్షణ గోడ పనులు చివరిదశలో ఉన్న కారణంగా ఆయన పరిశీలించి తగు సూచనలిచ్చారు. శ్మశానంలో దహన సంస్కారాలు చేసే దగ్గర రేకుల షెడ్డు మరమ్మతు పనులు జరుగుతుండటంతో దానికి సంబంధించి జీవీఎంసీ అధికారి సివిల్ ఏఈ రత్నాకర్‌ను కార్పొరేటర్ ఆరా తీశారు.

పారిశుధ్య కార్మికులకు చీరల వితరణ


చీరలు అందిస్తున్న కీర్తి పట్నాయక్

మురళీనగర్: మురళీనగర్‌లోని శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మురళీనగర్ పరిసరాలకు చెందిన మహిళా పారిశుధ్య కార్మికులకు ట్రస్ట్ చైర్‌పర్సన్ కుప్పిలి కీర్తి పట్నాయక్ చీరలు పంపిణీ చేశారు. కాలనీల్లో పరిశుభ్రతకు కృషి చేస్తున్న మహిళా కార్మికులకు ఏమి ఇచ్చినా రుణం తీర్చుకోలేమని ఆమె అన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, చిరంజీవి పాల్గొన్నారు.

వేద పఠనంతో లోకశాంతి


చతుర్వేద పారాయణం చేస్తున్న టీటీడీ వేద పండితులు

సీతమ్మధార: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం రెండో రోజు సీతమ్మధార ఏఎస్సార్ నగర్ కొండపై గల 108 అడుగుల అభయాంజనేయ స్వామి ఆలయంలో శుక్ల యజుర్వేద పండితుడు దాంపర్తి నరేంద్ర(ఘనాపాఠి) పర్యవేక్షణలో 20 మంది వేద పడింతులుచే చతుర్వేద పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు మాట్లాడుతూ వేదం పఠించడం ద్వారా లోకశాంతి, విశ్వ శ్రేయస్సు కలుగుతుందన్నారు. ప్రతి దేవాలయంలో మంత్ర రూపం దేవత శక్తిని పెంపొందించి విశ్వశాంతి కోసం టీటీడీ సౌజన్యంతో సంపూర్ణ చతుర్వేద పారాయణాలు జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శంభూశర్మ, బులుసు సంతోష్‌కుమార్, దాకూరి రామకృష్ణ, గిరి శ్రీనివాస్, ఆలయ ధర్మకర్త ఏఎస్ఎస్ రాజు, అర్చకులు అనిరుథ్, భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం


మాధవధారలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్


మద్దిపాలెం: ఇటీవల జీవీఎంసీ 50వ వార్డులో రూ.1.94 కోట్లతో నిర్మాణం పూర్తయిన పలు అభివృద్ధి పనులను మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ప్రారంభించిన సంగతి తెలిసిందే. అవే నిధుల్లో రూ.96 లక్షలకు సంబంధించి మాధవధార, మురళీనగర్, వంశీపగన్, నరసింహనగర్ ప్రాంతాల్లో పూర్తయిన సీసీ రోడ్లు, డ్రైయిన్లు, బీటీ రోడ్లకు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి సోమవారం ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు కొబ్బరికాయ కొట్టి, శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టరు, జేసీఎస్ కన్వీనర్ అమర్‌రెడ్డి, బగాది విజయ్, పైడి శ్రీను, పైడి ప్రతాప్, రామగోపాల్, రామచంద్రరావు, ఎం.లక్ష్మి, సరస్వతి, నారాయణస్వామి, సబ్బవరపు శ్రీను, ఏవిఎన్ రాజు, వరద రాజులు తదితరులు పాల్గొన్నారు.

శ్లాబ్ పనులు..


యువజన సమాజం నూతన భవనం శ్లాబ్ పనులు ప్రారంభిస్తున్న కె.కె.రాజు

జీవీఎంసీ 50వ వార్డులోని మాధవ యువజన సమాజం నూతన భవనంపై మొదటి అంతస్తు శ్లాబ్ నిర్మాణ పనులను సోమవారం కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టారు, జేసీఎస్ కన్వీనర్ అమర్‌రెడ్డి, బగాది విజయ్, పైడి శ్రీను, పైడి ప్రతాప్, ఏవీఎన్ రాజు, నారాయణస్వామి, ఎం.లక్ష్మి, సరస, సుమతి, వరదరాజులు పాల్గొన్నారు.

ఐరన్ ఓర్ లోడింగ్‌లో వాల్తేరు డివిజన్ రికార్డ్


వాల్తేర్ డివిజన్‌లో ఐరన్ ఓర్ లోడింగ్

తాటిచెట్లపాలెం: సరకు రవాణాదారుల సహాయ సహకారాలతో డివిజన్ సిబ్బంది కృషితో ఐరన్ ఓర్ లోడింగ్‌లో గత ఏప్రిల్ నుంచి జనవరి ముగింపు నాటికి వాల్తేర్ డివిజన్ ఆల్‌టైం హై రికార్డ్ సాధించినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. 2022–23లో రోజుకు సగటున 11 రేక్‌ల ఐరన్ ఓర్ లోడింగ్ జరిగితే, 2023–24 జనవరి వరకు రోజుకు సగటున 14 రేక్‌ల లోడింగ్ జరిగిందని చెప్పారు. 2022–23లో 14.63 మిలియన్ టన్నుల ఐరన్ ఓర్‌ను లోడింగ్ చేయగా.. 2023–24 జనవరి వరకు 18.34 మిలియన్ టన్నుల ఐరన్ ఓర్‌ను లోడింగ్ చేశారన్నారు. గత ఆర్థిక ఏడాది కంటే ఇది సుమారు 25.36 శాతం అధికమని తెలిపారు. వాల్తేర్ డివిజన్ గత ఆర్థిక సంవత్సరం రోజుకు సగటున 62.4 రేక్‌ల సరకును లోడింగ్ చేస్తే, ఈ జనవరి నాటికి రోజుకు సగటున 63.6 రేక్‌ల సరకును లోడింగ్ చేసి అత్యుత్తమ రికార్డును నమోదు చేసిందని వెల్లడించారు. ఈ ఫలితాలు సాధించడంలో సహకరించిన వినియోగదారులైన ఎన్ఎండీసీ, ఆర్ఐఎన్ఎల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, కేఐఓసీఎల్ లిమిటెడ్ తదితరుల సహకారం మరువలేనిదన్నారు.

29లోగా కార్మిక శాఖ నుంచి లైసెన్స్ పొందాలి

సీతంపేట: జిల్లాలోని దుకాణదారులు, వాణిజ్య వ్యాపార సంస్థలు తప్పనిసరిగా కార్మికశాఖ నుంచి లైసెన్స్ పొందాలని సహాయ కార్మికశాఖ కమిషనర్ సర్కిల్–2 బుద్ధా మునిస్వామి పేర్కొన్నారు. దుకాణాలు, వాణిజ్య వ్యాపార సంస్థలు, మోటార్ రవాణా వాహన యజమానులు, అంతరరాష్ట్ర వలస కార్మికులను వినియోగించే వారు కార్మిక చట్టం ప్రకారం విధిగా ఈ నెల 29లోగా రిజిస్ట్రేషన్ చేసి సర్టిఫికెట్ పొందాలన్నారు. కార్మిక చట్టాలన్నీ కలిపి ఒకే రిజిస్ట్రేషన్ పత్రం పొందే అవకాశం ఉందని, ఇప్పటికే రిజిస్ట్రేషన్ పొందిన వారు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. గడువులోగా రిజిస్ట్రేషన్ పత్రం పొందని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

వాహనాల తనిఖీ

సీతమ్మధార: నేరాల నియంత్రణలో భాగంగా సోమవారం బాలయ్యశాస్త్రి లేఅవుట్ దరి అభయాంజనేయ స్వామి ఆర్చి రోడ్డులో ఫోర్త్‌టౌన్, ద్వారకా క్రైం ఎస్ఐలు భాస్కర్, ఎస్.రాజు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలు విడిచిపెట్టినప్పుడు తాళం వేసుకొని వెళ్లాలని, సీసీ కెమెరాలు ఉన్న చోట పార్క్ చేయాలని సూచించారు. బైక్‌లకు రిమోట్ లాక్, జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం, వీల్ లాక్ వంటి ఆధునిక పద్ధతులను ఉపయోగించాలన్నారు. తద్వారా నేరస్తుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని చెప్పారు.


ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేస్తున్న క్రైం పోలీసులు

ఇంజినీరింగ్ సెకండియర్ పరీక్ష వాయిదా

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 7న జరగాల్సిన ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం మొదటి సెమిస్టర్ బీటెక్, బీఈ, బీఆర్క్ పరీక్షను వాయిదా వేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను ఈ నెల 19న నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

'స్పందన'కు 18 అర్జీలు


అర్జీలు పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీరామమూర్తి

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 18 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ జి.శ్రీరామమూర్తి స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్ లక్షణాలపై అప్రమత్తం


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసులురెడ్డి

మురళీనగర్: క్యాన్సర్ వ్యాధి లక్షణాలను సకాలంలో గుర్తిస్తే నివారణ సులువవుతుందని రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి అన్నారు. మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం సోమవారం వైశాఖి మహిళా భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ బారిన పడిన వారు మూడు, నాలుగు దశలు వచ్చే వరకు తెలుసుకోలేకపోవడం వల్ల ప్రాణాపాయ స్థితికి వెళ్తున్నారని చెప్పారు. మహిళలు మేమోగ్రఫీ, పాప్‌స్మియర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్లబ్ అధ్యక్షురాలు పొందూరి ప్రభావతి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి వనితా వాకర్స్ క్లబ్ మహిళలు ఘనంగా సత్కరించారు. ఫిబ్రవరిలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్న మహిళలకు చిరు కానుకలు అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి జయ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి నిందితుల కోసం గాలింపు

సీతమ్మధార: గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుల కోసం ఫోర్త్‌టౌన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం అల్లూరి జిల్లా పాడేరు నుంచి కారు(ఏపీ39 ఎస్‌క్యూ 2485)లో ఇద్దరు వ్యక్తులు 140 కిలోల గంజాయిని తరలిస్తూ విశాఖ తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్డులోని కేంద్రీయ విద్యాలయం వెనుక గేటు వద్ద కారు పార్క్‌చేసి వెళ్లిపోయారు. కారును సీజ్ చేసిన పోలీసులు.. నిందితులిద్దరిని అనంతగిరికి చెందిన ఉమామహేశ్వరరావు, పూర్ణ చంద్రరావు(కారు ఓనర్)గా గుర్తించారు. 2022 డిసెంబర్‌లో గంజాయి తరలిస్తున్న కేసులో ఏడుగురిని అరెస్ట్ చేశారు. అందులో అనంతగిరికి చెందిన పూర్ణ చంద్రరావు ఉన్నట్లు గుర్తించారు. పాడేరులో గంజాయి పండించి, వారే కారులో ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు తెలిసింది. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరో అధికారులు సోమవారం ఇద్దరి వివరాల గురించి ఫోర్త్‌టౌన్ ఎస్ఐ వెంకటరావుకు సమాచారమిచ్చారు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం పేరిట మోసం

- రిమాండ్‌కు నిందితుడు

మద్దిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తికి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.8 లక్షలు తీసుకుని మోసం చేసి, పోలీసులకు లొంగిపోయిన నిందితుడిని రిమాండ్‌కు తరలించిన ఘటన వెలుగుచూసింది. పోలీసుల తెలిపిన వివరాలిలా.. కప్పరాడలో నివసిస్తున్న లగుడు రవీంద్ర అనే వ్యక్తికి కొద్ది రోజుల కిందట హైదరాబాద్‌కు చెందిన వనమాడ మోహన్‌కుమార్ స్నేహితుల ద్వారా పరిచయమై న్యూజిల్యాండ్ దేశంలోని ఓ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పాడు. మోహన్‌కుమార్‌కు సదరు బాధితుడు రవీంద్ర దఫదఫాలుగా రూ.8 లక్షలు చెల్లించాడు. వెంటనే నకిలీ పత్రాలు, కాల్ లెటర్‌లు సృష్టించి ఇదిగో అయిపోయింది, అదిగో అయిపోయిందని నమ్మబలికాడు. తీరా చూసేసరికి చివరి క్షణంలో వీసా రద్దయ్యిందన్నాడు. దీంతో రవీంద్ర పదే పదే డబ్బుల కోసం అడగగా.. ఈ నెల 4వ తేదీ ఆదివారం కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో మోహన్‌కుమర్ లొంగిపోయాడు. అతడిని విచారించి సోమవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఉమెన్ ఎస్ఐ దివ్య భారతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం


అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్–5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి నాలుగు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి పరిశీలించారు. ఆయా విభాగాల అధికారులకు వినతులను అందజేసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 03, యూసీడీ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ చెప్పారు. జగనన్నకు చెబుదాంలో వచ్చిన అర్జీల తక్షణ పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సాయంత్రం సచివాలయ సిబ్బంది, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జెడ్సీ కృష్ణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్–1 టీఎస్ఎన్ రాజు, సూపరింటెండెంట్–2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఇంజినీరింగ్ ఈఈలు టి.ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, డీఈ భరణికుమార్, వాటర్ వర్క్స్ ఈఈ సూరిశెట్టి శేఖర్, టౌన్ ప్లానింగ్ అధికారి అపరంజిత, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి పాల్గొన్నారు.

బూత్ ఏజెంట్లతో సమావేశం


బీఎల్ఏలకు దిశానిర్దేశం చేస్తున్న కె.కె.రాజు

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డుకు సంబంధించిన పోలింగ్ బూత్ ఏజెంట్లు, ముఖ్య నాయకులతో సోమవారం అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ వద్ద ఒక ఫంక్షన్ హాల్లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారికి వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ రానున్న ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం పార్టీ శ్రేణులకు, సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు సంక్రాంతి కానుకగా నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీష్, 43వ వార్డు నాయకులు తిరుపతి, ఠాగూర్, బైర వెంకట్, పారుపల్లి రవి, మహాదాస్య గోపి, కె.సతీష్‌కుమార్, పద్మాశేఖర్, సేతల కుమార్, ఖాదర్, వల్లి, రమణారెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం


అగ్నిప్రమాదం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు సంజీవయ్య కాలనీలో క్లస్టర్–2 సచివాలయ గృహసారథిగా పనిచేస్తున్న పి.ఈశ్వరమ్మ ఇంట్లో ఆదివారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. ఇంట్లోని గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఆస్తి నష్టం జరగడంతో స్థానికులు జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్‌కు ప్రమాద ఘటన సమాచారాన్ని అందించారు. ఈమేరకు సోమవారం ఆయన రెవెన్యూ అధికారులతో కలిసి ప్రమాద స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటామని సతీష్ భరోసా ఇచ్చారు.